ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పెద్దపల్లి

జిల్లా వార్తలు

5★

శనివారం 23 నవంబరు 2024



న్యూస్ బాక్స్

నేడు డయల్ యువర్ డీఎం

మంథని, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మంథని ఆర్టీసీ డిపో పరిధిలోని పలు గ్రామాల ప్రయాణికుల సమస్యలు, అవసరాలు తెలుసుకునేందుకు శనివారం ఉదయం 11 గంటలకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డీఎం శ్రావణ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. రవాణా ఇబ్బందులు, సూచనలు తెలియజేయడానికి సెల్‌ఫోన్ నంబరు 7382825923కు కాల్ చేయాలని ఆయన సూచించారు.

మంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం

మంథని, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం రైతుల సన్న వడ్లకు రూ.500 బోనస్ ప్రకటించి ఇస్తుండటంతో స్థానిక శ్రీపాద కాలనీలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చిత్రపటానికి శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకుడు మూల పురుషోత్తంరెడ్డి, బెజ్జంకి డిగంబర్, రైతులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సమస్యలను పరిష్కరించాలి

మంథని, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని బోయినిపేట మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కరించాలని కోరుతూ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు హైదరాబాద్‌లో వినతిపత్రాన్ని అందజేసినట్లు జిల్లా మత్స్య సహకారం సంఘం డైరెక్టర్ పోతరవేన క్రాంతికుమార్ శుక్రవారం తెలిపారు. తమ సమస్యల పరిష్కారానికి మంత్రి శ్రీధర్‌బాబు సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నేతలు సబ్బని సమ్మయ్య, పోతరవేన అర్జున్, పోలు కనుకరాజు, డిష్ రాజు, బొజ్జ శ్రీను, జడిగల లక్ష్మణ్‌లు ఉన్నారు.

గ్రహణం వీడేదెన్నడో?

- ప్రభుత్వాలు మారినా.. పూర్తికాని పనులు
- నత్తనడకన ఓడేడు-గర్మిళ్లపల్లి వంతెన
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు




అసంపూర్తిగా ఓడేడు-గర్మిళ్లపల్లి వంతెన

ముత్తారం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు మారుతున్నాయి.. పాలకులు మారుతున్నారు.. అయినా ఓడేడ్ -గర్మిళ్లపల్లి గ్రామాల మధ్య మానేరుపై చేపట్టిన హైలెవల్ వంతెనకు పూర్తికావడం లేదు. వంతెన నిర్మాణం ప్రారంభమై పదేళ్లు కావస్తున్నా గ్రహణం వీడడం లేదు.. నిధులు పుష్కలంగా ఉన్నా అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపంతో పనుల్లో తీవ్రంగా జాప్యం జరుగుతోంది. శంకుస్థాపన చేసి సుమారు 16ఏళ్లు గడుస్తున్నా.. బ్రిడ్జి పిల్లర్ల దశదాటనే లేదు. వంతెన అందుబాటులోకి వస్తే.. ఉమ్మడి వరంగల్, కరీంనగర్, అదిలాబాద్ జిల్లాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుంది. వ్యవసాయం, సింగరేణి, జెన్‌కో పారిశ్రామిక ప్రాంతాలకు అనేక రకాలుగా ప్రయోజనాలు కలుగుతాయి.

● ఉమ్మడి ఏపీలో బీజం..

ఇక్కడి ప్రజాప్రతినిధుల విన్నపం మేరకు మానేరుపై వంతెన నిర్మాణానికి 2008 సెప్టెంబరు 19న అప్పటి ఉమ్మడి ఏపీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి రూ.6కోట్లు మంజూరు చేశారు. ఆర్‌అండ్‌బీ ఇంజనీర్లు సర్వే చేసి, మట్టి నమోనాలు సేకరించి వాగుపై లోలెవల్ వంతెనకు అనుకూలంగా లేదని, హైలెవల్ వంతెన నిర్మాణానికి ప్రతిపాదించారు. దీంతో 2013 ఏప్రిల్ 27న అప్పటి సీఎంకు రూ.30కోట్లతో ప్రతిపాదనలు అందగా, తెలంగాణ ఆవిర్భావం తర్వాత రూ.47.7కోట్లు

మిగతా 8వ పేజీలో...



ఈదురుగాలికి కూలిన గర్డర్‌లు

● కూలిన గర్డర్‌లు..

ఈ ఏడాది జూలై నేలలో చిన్నపాటి ఈదురుగాలులకు గర్డర్‌లు నేలమట్టమయ్యాయి. మంత్రి శ్రీధర్‌బాబు కూలిన వంతెనను పరిశీలించి త్వరగా పనులు చేపడుతామని హామీ ఇచ్చారు. అయినా కూడా ప్రయోజనం కనిపించడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు వంతెన నిర్మాణం త్వరగా పూర్తిఅయ్యేలా చర్యలు చేపట్టాలని రెండు జిల్లాల సరిహద్దు గ్రామాల ప్రజ లు కోరుతున్నారు.

● మూడు జిల్లాలతో అనుసంధానం..

ఉమ్మడి కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాలకు రవాణా సౌకర్యం కల్పించడం, దూరభారం తగ్గించడం కోసం పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడు... జయశంకర్ భూపాలపల్లి జిల్లా గర్మిళ్లపల్లి మధ్య మానేరుపై హైలెవల్ వంతెన నిర్మాణానికి పూనుకున్నారు. ఇందు కోసం ఆర్‌అండ్‌బీ నుంచి రూ.47.7 కోట్లు మంజూరు చేశారు. 2016 ఆగస్టు 4న పనులకు శంకుస్థాపన చేశారు. ఈ వంతెనను 23 పిల్లర్లు, రెండు గోడలతో కలిపి మొత్తం 24స్లాబులతో నిర్మించేందుకు ఇంజనీర్లు డిజైన్ చేశారు. అయితే, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల పట్టింపులేనితనం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో పనులు పిల్లర్ల దశలోనే నిలిచాయి. ఇప్పటివరకు 40శాతం పనులు మాత్రమే పూర్తికాగా, రూ.20కోట్ల వరకు అధికారులు బిల్లులు చెల్లించినట్లు తెలుస్తోంది. వంతెన అందుబాటులోకి వస్తే ప్రజలకు వరంగల్లు దగ్గరవుతుంది.



నిరుపయోగంగా ఉన్న బాలుర వసతిగృహం

నిరుపయోగంగా ప్రభుత్వ భవనాలు

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం..

8



మాట్లాడుతున్న కౌశిక హరి

మెరుగైన బోనస్ ఇచ్చేవరకు సమ్మె..

- కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కౌశిక హరి

8

మాజీ మంత్రిని విమర్శించడం సరికాదు

- రామగుండంలో కూల్చివేతలు తప్ప అభివృద్ధి లేదు
- డిప్యూటీ మేయర్ అభిషేక్‌రావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ అభిషేక్‌రావు

గోదావరిఖని, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఏ హోదాతో కాంగ్రెస్ నాయకులు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను విమర్శిస్తున్నారని, ఇది సరైంది కాదని డిప్యూటీ మేయర్ అభిషేక్‌రావు అన్నారు. శుక్రవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2001 నుంచి ఉద్యమ పార్టీలో ఉంటూ ఆరుసార్లు కొప్పుల ఈశ్వర్ ఎమ్మెల్యేగా గెలిచారని, అలాంటి వ్యక్తిని పట్టుకుని గౌరవం లేకుండా మాట్లాడడం కాంగ్రెస్ నాయకులకు తగదన్నారు. రామగుండం ప్రజలంటే మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు ఎనలేని ఇష్టమని, రూ.250కోట్లు రామగుండం అభివృద్ధికి మంత్రి కొప్పుల తీసుకువచ్చారని, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కేసీఆర్ వద్దకు వెళ్లి రామగుండానికి మెడికల్ కళాశాల కావాలని అడగడంతోనే ఇచ్చారని చెప్పారు. రామగుండంలో ఎలాంటి మాస్టర్ ప్లాన్ లేకుండానే కూల్చివేతలు జరుగుతున్నాయని, జీఎంను అడిగినా, కమిషనర్‌ను అడిగినా మాకేం తెలియదంటూ సమాధానం చెబుతున్నారని, బీఆర్‌ఎస్ మహిళా కార్పొరేటర్లను అవమానపర్చడంతో పాటు ఇబ్బందులకు గురిచేశారని, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు మర్యాద లేకుండా మాట్లాడడం సరైంది కాదన్నారు. రాబోవు స్థానిక సంస్థల కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజలే వారికి బుద్ధి చెబుతారన్నారు. విలేకరుల సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు గోపు ఐలయ్య యాదవ్, మారుతి, మెతుకు దేవరాజు, తోకల రమేష్, నట్టు శ్రీనివాస్, సంధ్యారెడ్డి, స్వప్న పాల్గొన్నారు.

అవమానపరిచేలా మాట్లాడడం సరికాదు..

కళ్యాణ్‌నగర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మాలలు, మాల ఉప కులాలను మాదిగలు అవమానపరుస్తూ మాట్లాడడం సరైందికాదని మాల సంఘం నాయకుడు గుమ్మడి కుమారస్వామి అన్నారు. సోమవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాలలను మనువాదులుగా చిత్రీకరించి మంద కృష్ణ మాట్లాడడం తీవ్రంగా ఖండిస్తున్నామని, ఔన్నత్యంగల జాతి మాల జాతి అని, గతంలో కూడా పెద్దపల్లి ఎంపీ టికెట్ మాలలు ఇవ్వవద్దని మాట్లాడడం, గడ్డం వంశీకృష్ణకు టికెట్ ఇస్తే ఊరుకోమని మాదిగలు హెచ్చరించడం సరైందికాదన్నారు. ఒకరికి టికెట్ ఇవ్వద్దని చెప్పే అధికారం ఎక్కడిదని, అంబేద్కర్ సమానత్వం కావాలని మాల మాదిగలకు రిజర్వేషన్ కల్పించారని చెప్పారు. సుల్తానాబాద్‌లో చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌ను టార్గెట్ చేస్తూ మాదిగలు మాట్లాడడం సరైందికాదన్నారు. అగ్రవర్ణాలకు 10శాతం ప్రధాని నరేంద్రమోదీ ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ కల్పిస్తే ఎందుకు మాట్లాడడం లేదని, తక్కువ జనాభా ఉన్నా ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్ కల్పిస్తే మాలమాదిగలకే అన్యాయం జరుగుతుందన్నారు. ఎస్సీ వర్గీకరణ చేయవద్దని మాయవతి, ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ ప్రకటన చేశారని, మాదిగలకు కులవృత్తి ఉంది కానీ, మాలలకు కులవృత్తి లేదన్నారు. మాలలపై మాదిగలు శత్రుత్వం పెంచుకోవద్దన్నారు. అందరూ కలిసి ఉండాలన్నారు. డిసెంబర్ 1న హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే మాలల సింహగర్జనను విజయవంతం చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో నాయకులు కనకరాజు, దశరథం, శ్రీనివాస్, సుశీల, ఆరె దేవకరుణ, వెంకటి, కారం వినయ్, బొమ్మక వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రేపటి నుంచి ప్రత్యేక ఓటర్ నమోదు శిబిరం

ఓదెల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామాల్లో 23,24న ఓటర్ నమోదు ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ యాకయ్య తెలిపారు. 2025 జనవరి ఒకటవ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఓటర్ జాబితాలో సవరణ, మార్పులు చేసుకోవాలని కోరారు. సంబంధిత పోలింగ్ కేంద్రం వద్ద ఉదయం 9 నుంచి సాయంత్రం 5వరకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు.

కార్పొరేట్‌కు దీటుగా వైద్య సేవలు : కలెక్టర్



ఫైళ్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

పెద్దపల్లిటౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు వైద్య సేవలు అందిస్తున్నామని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. శుక్రవారం కలెక్టర్ కోయ శ్రీహర్ష కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో నూతనంగా తయారుచేసిన పేషంట్స్ ఫైల్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మాతాశిశు ఆరోగ్య కేంద్రం, జిల్లా ఆసుపత్రిలో ఇన్ పేషెంట్ల రిపోర్ట్స్, డిశ్చార్జీ సమ్మరీ భద్రపర్చేందుకు నూతనంగా ఫైల్‌లను తయారుచేయడం జరిగిందని, కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు సేవలు అందుతున్నాయని కలెక్టర్ తెలిపారు. గత 4నెలల కాలంలో ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య, ఆర్థోపెడిక్ శస్త్ర చికిత్సలు, డెంటల్ శస్త్రచికిత్సలు, స్కానింగ్ సేవలు చిన్నపిల్లల వైద్యం ఔట్ పేషెంట్, ఇన్‌పేషెంట్ సేవలు, కంటి శస్త్ర చికిత్సలు, టీహబ్ ద్వారా 56 రకాల రక్త పరీక్షలు, ఇతర వైద్య చికిత్సలు అధికంగా జరుగుతున్నాయని వివరించారు. ఇన్ పేషెంట్ రోగుల రికార్డు నిర్వహణకు ఉపయోగపడే విధంగా ఫైళ్లను తయారు చేసినందుకు సూపరింటెండెంట్, సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా మరింత మెరుగైన వైద్య చికిత్సల అందించే దిశగా పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, వైద్యాధికారులు డాక్టర్ వాసుదేవరెడ్డి డాక్టర్ స్రవంతి, డాక్టర్ భార్గవి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

పెద్దపల్లిటౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలు వార్డుల్లో అభివృద్ధి పనులకు శుక్రవారం ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు శంకుస్థాపనలు చేశారు. 4, 9 వార్డులల్లో రైల్వేస్టేషన్ రోడ్డు, సాయినగర్, చైతన్యపురి కాలనీలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు టీయూఎఫ్‌ఐడీసీ ప్యాకేజీ 5నిధులు కోటి 93 లక్షల 49వేల రూపాయలతో సీసీరోడ్లు, డ్రైనేజీ పనుల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎరుకల కల్పన రమేష్, కొంతం రాజేశ్వరి, తాడూరి పుష్పలత శ్రీమాన్, సర్వర్, నదీమ్, నూగిళ్ల మల్లయ్య, భూతగడ్డ సంపత్, శుభాష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వేణు

ముత్తారం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మచ్చుపేట, ఖైదంబండ, హరిపురం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ వేణు శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా కొనుగోలు కేంద్రాల్లో ఉన్న సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. తూకంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా హమాలీలతో జాగ్రత్త వహించాలని రైతుల వద్ద నుంచి ఎలాంటి ఫిర్యాదులు అందవద్దని సూచించారు. తేమ వచ్చిన ధాన్యాన్ని మాత్రమే రైస్ మిల్లులకు పంపించాలని సూచించారు. రైతులకు ఎలాంటి కోతలు విధించవద్దని ఆయన అన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి : సీఐ

కోల్‌సిటీటౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వ్యక్తుల అవసరాలను ఆసరాగా చేసుకొని సైబర్ నేరగాళ్ళు ఆధునిక టెక్నాలజీని వాడుకొని నేరాలకు పాల్పడుతున్నారని, ఈ విషయంలో ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండి ఆర్థికంగా నష్టపోవద్దని గోదావరిఖని సైబర్ క్రైమ్ సీఐ కృష్ణమూర్తి అన్నారు. శుక్రవారం గోదావరిఖని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పెరుగుతున్న ఆధునిక టెక్నాలజీతో సెల్‌ఫోన్ వినియోగం పెరిగిపోయిందన్నారు. ప్రతిదీ కూడా సెల్ ఫోన్‌తోనే లింక్ ఉండటంతో సెల్‌ఫోన్ నెంబర్ కూడా బ్యాంక్ అకౌంట్, పాన్‌కార్డు, ఆధార్‌కార్డు, పెన్షన్, పౌరసరఫరాల వినియోగానికి సంబంధించి అన్నింటికి ఫోన్ నెంబర్ అవసరం ఉంటుందన్నారు. దానిని ఆసరాగా చేసుకొని సైబర్ నేరస్తులు ఏదో లేనిపోని ఆశలు చూపిస్తూ మోసాలకు పాల్పడుతున్నారన్నారు. కొత్తగా పెళ్లి కార్డులు ఏపీకే ఫైల్స్, డిజిటల్ అరెస్ట్ అని సైబర్ నేరాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. సైబర్ నేరాల పట్ల, ర్యాగింగ్, మత్తుపదార్థాలు వాడకం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఏటీఎం పిన్‌నంబర్, సీవీవీ, బ్యాంక్ ఖాతా తదితర వివరాలు కోరితే ఇవ్వొద్దని సూచించారు. బ్యాంక్ ఖాతా నుంచి డబ్బును కోల్పోతే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

టోల్ ఫ్రీనెంబర్ 1930కి లేదా 100లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక సిబ్బంది, సైబర్ క్రైమ్స్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి ట్రాఫిక్ విధులు

పెద్దపల్లిటౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఒకరికి జడ్జి మంజుల రెండురోజుల ట్రాఫిక్ డ్యూటీ శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. శుక్రవారం వాహనాల తనిఖీల్లో మద్యం సేవించి పట్టుబడ్డ మొత్తం 17 మందిని పెద్దపల్లి ట్రాఫిక్ పోలీసులు స్థానిక కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి 17 మందికి 20వేల 400 రూపాయల జరిమానా విధించారు. అయితే అత్యధికంగా మద్యం సేవించి వాహనం నడిపిన సుల్తానాబాద్ మండలం మంచిరామి గ్రామానికి చెందిన అవుల రమేష్‌కు వెయ్యి రూపాయల జరిమానాతోపాటు సామాజిక సేవలో భాగంగా రెండు రోజులపాటు ట్రాఫిక్ విధులు నిర్వహించాలని తీర్పునిచ్చారు. శని, ఆదివారాల్లో రమేష్‌ను ట్రాఫిక్ విధుల్లో ఉపయోగించుకోవాలని ట్రాఫిక్ పోలీసులను ఆదేశించారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. ట్రాఫిక్ సీఐ అనిల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడిపి ఇతరుల ప్రాణాలకు హానీ కలిగించవద్దని సూచించారు.

కంటి శస్త్రచికిత్సలను సద్వినియోగం చేసుకోవాలి

పెద్దపల్లిటౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వాస్పత్రిలో కంటి ఆపరేషన్లు ప్రారంభించామని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ప్రధాన ఆస్పత్రిలో 15 లక్షల రూపాయలతో కంటి ఆపరేషన్ థియేటర్ ఏర్పాటుచేసినట్లు, కంటి శస్త్రచికిత్సలను శుక్రవారం నుంచి ప్రారంభించామని తెలిపారు. జిల్లా ఆసుపత్రిలో కంటి ఆపరేషన్ థియేటర్ ప్రారంభమైందని, తొలిరోజు విజయవంతంగా 4కంటి శస్త్రచికిత్సలు ఆప్తామాలజిస్ట్ వైద్యులు డాక్టర్ సబీయా, డాక్టర్ సింధూర నిర్వహించారన్నారు. కంటి శస్త్రచికిత్స అవసరమైన వారు ప్రభుత్వ ఆసుపత్రిలో సంప్రదించాలని, నైపుణ్యం అనుభవం కలిగిన వైద్యులు, అవసరమైన పరికరాలు అందుబాటులో ఉన్నాయని, వీటిని ప్రజలు వినియోగించుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.

ఇసుక అక్రమ తరలింపు వాహనాల పట్టివేత

పెద్దపల్లి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఈనెల 21 నాటికి అక్రమంగా ఇసుక తరలిస్తున్న 149 వాహనాలను నిర్బంధించి 25,99,790 రూపాయల జరిమానా వసూలు చేసినట్లు కలెక్టర్ కోయ శ్రీహర్ష ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జిల్లాలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న 86 ట్రాక్టర్లు, 63 టిప్పర్లను పట్టుకొని కేసులు బుక్ చేసినట్లు తెలిపారు. ఇక నుంచి జిల్లాలో అక్రమంగా ఇసుక తరలించే ట్రాక్టర్ నుంచి 25 వేల రూపాయలు, టిప్పర్ నుంచి లక్ష రూపాయల జరిమానా వసూలు చేస్తామని, అంతేకాకుండా అక్రమ ఇసుక రవాణాదారులపై సెక్షన్ 379, 21 ఎంఎండిఆర్ యాక్ట్ 1957, పీడీ యాక్ట్‌ల కింద కేసు నమోదు చేసి కఠినచర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు ఇసుకను ఆన్‌లైన్ ద్వారా సాండ్ ట్యాక్సీ ద్వారా బుక్ చేసుకోవాలని, బుక్ చేసుకున్న 24 గంటలలో ఇసుక డెలివరీ చేయడం జరుగుతుందని, సాండ్‌ట్యాక్సీ విధానాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

మహిళా సాధికారతకు వీ హబ్ తోడ్పాటు : కలెక్టర్

పెద్దపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) :జిల్లాలోని మహిళల సాధికారత సాధన కోసం వీ హబ్ తోడ్పాటు అందిస్తుందని, దీనిని వినియోగించుకొని మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. శుక్రవారం కలెక్టర్ కలెక్టరేట్‌లో వీ హబ్ ప్రతినిధులతో అదనపు కలెక్టర్ అరుణశ్రీతో కలిసి సమావేశమయ్యారు. మహిళ సంఘాలచే ఏర్పాటుచేసే చిన్నకుటీర పరిశ్రమలు, వాటి ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించడం, లాభసాటిగా మహిళలు వ్యాపారం చేయడానికి అవసరమైన శిక్షణ తదితర అంశాల గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని స్వశక్తి మహిళా సంఘాలకు ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా ఏర్పాటుచేసే వ్యాపారాలకు మంచి మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలన్నారు. వీ హబ్ ప్రతినిధులు అందించే సహకారాన్ని పూర్తిగా వినియోగించుకోవాలని, జిల్లాలో మహిళా సాధికారత దిశగా పని చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో వీహబ్ ప్రతినిధులు సీతా, జహీద్‌అక్తర్‌షేక్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఖని ఆపిల్ కిడ్స్ పాఠశాలకు గుర్తింపు..

కోల్‌సిటీటౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): గోదావరిఖనికి చెందిన ఆపిల్ కిడ్స్ పాఠశాలకు ప్రతిష్టాత్మకమైన ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్ గుర్తింపు లభించింది. 2024-25 విద్యాసంవత్సరానికి ఆక్స్‌ఫర్డ్ క్వాలిటీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గోదావరిఖనిలో పాఠశాల ఆవరణలో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్ ప్రతినిధులు పాఠశాల ప్రిన్సిపాల్ గాలి సునీతారవికి సర్టిఫికేట్, ఫ్లేక్ బ్యానర్‌లను అందజేశారు.

జ్వరంతో బాలుడి మృతి

భీమారం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా భీమారం మండల కేంద్రంలో శుక్రవారం జ్వరంతో బాలుడు మృతి చెందాడు. భీమారం మండల కేంద్రానికి చెందిన ముంజ జలంధర్-శిరీషల కుమారుడు రిషి (13) కొన్ని రోజులుగా జ్వరంతో బాధపడుతున్నారు. కుటుంబ సభ్యులు నాలుగు రోజుల క్రితం కోరుట్ల ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి వైద్యుల సూచనల మేరకు మెరుగైన చికిత్స కోసం రిషిని కరీంనగర్ ఆస్పత్రికి శుక్రవారం తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు.


రిషి (ఫైల్)

అనుమతి లేని ఇసుక లారీ పట్టివేత

మెట్‌పల్లి టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో గురువారం అర్ధరాత్రి అనుమతి లేకుండా తరలిస్తున్న ఇసుక లారీని పట్టుకుని సీజ్ చేసినట్లు మెట్‌పల్లి సీఐ నిరంజన్ రెడ్డి శుక్రవారం తెలిపారు. పట్టణంలో అర్ధరాత్రి సమయంలో ఎఎస్‌ఐ సత్తయ్యతో కలిసి పోలీసు బృందం వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా కోరుట్ల నుంచి నిజామాబాదు వైపు ఇసుక లోడుతో వెళుతున్న లారీ ఆపి తనిఖీ చేశారు. ఎలాంటి పత్రాలను లేవని తెలపడంతో లారీని పోలీసు స్టేషన్‌కు తరలించారు. రెవెన్యూ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి లారీని సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. లారీ ఓనరైన అర్మూర్ పట్టణానికి చెందిన రజనీకాంత్ రెడ్డితో పాటు డ్రైవర్ ధారవేణి భూమయ్యపై కేసు నమోదు చేశారు.

రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీలకు ఎంపిక


విద్యార్థినిని అభినందిస్తున్న డైరెక్టర్

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్థానిక జ్యోతి ఐఐటీ అకాడమీకి చెందిన 9వ తరగతి విద్యార్థి సంజన రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ బియాల హరిచరణ్‌రావు తెలిపారు. నెల 21వ తేదీన చొప్పదండిలో జరిగిన ఎస్‌జీఎఫ్ జోనల్ స్థాయి అండర్ 17 నెట్ బాల్ పోటీల్లో గెలుపొంది, ఈ నెల 23నుంచి 5వ తేదీ వరకు మహబూబాబాద్‌లో జరిగే రాష్ట్ర నెట్ బాల్ పోటీలకు ఎంపికైందన్నారు. పాఠశాల డైరెక్టర్‌లు హరిచరణ్‌రావు, శ్రీధర్‌రావు, మౌనికరావు, అజితరావు, రజితరావు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

కంకర వేశారు.. తారు మరిచారు

ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు


మొగిలిపేటలో కంకర దుమ్ముతో కూడిన రహదారి

మల్లాపూర్, నవంబరు, 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రహదారిల పునరుద్ధరణలో భాగంగా మండలంలోని మొగిలిపేట ప్రధాన రహదారి గుంతలమయంతో ప్రమాదకరంగా మారడంతో మరమ్మతులకు నిధులు మంజూరు చేశా రు. కానీ రోడ్డు నిర్మాణం కోసం కంకర పోసి తారు మరవడంతో దుమ్ము, దూలి, గుంతలతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందుల పాల్పడుతున్నారు. ప్రతి నిత్యం వందల సంఖ్యలో వాహనాలు, వేల సంఖ్యలో ప్రజలు ప్రయాణం చేస్తుంటారు. గుంతల మయంగా మారిని రహదారిపై మరమ్మతుల కింద 45 రోజుల క్రితం కంకర పోసి వదిలేశారు. దీంతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి పనులు త్వరగా పూర్తి చేయాలని గ్రామస్థులు, ప్రయాణికులు కోరుతున్నారు.

అపార్ కార్డులు

తప్పని కష్టాలు



- పాఠశాల రికార్డులతో సరిపోలని ఆధార్ వివరాలు
- చాలా మంది విద్యార్థుల వ్యక్తిగత వివరాల్లో తేడాలు



వెల్గటూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న ఒకటవ తరగతి నుంచి 12వ తరగతి వరకు గల విద్యార్థులకు ఆపార్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టింది. వన్ నేషన్ వన్ కార్డులో భాగంగా ఆటో మేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) పేరుతో 12 అంకెల సంఖ్యతో కార్డు జారీ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఒకటి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు వీటిని జారీ చేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలో అన్ని పాఠశాలల నుంచి విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్‌లో సేకరించే కార్యక్రమాన్ని చేపట్టింది. విద్యార్థుల పురోగతిని అంచనా వేయడానికి ఇది ఉపయోగపడు తుందని అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే విద్యార్థులకు ఆధార్ నెంబర్, పెన్ నెంబరు కేటాయించి నప్పటికీ, దేశవ్యాప్తంగా విద్యార్థికి అపార్ పేరుతో మరోనెంబర్ కేటాయించే కార్యక్రమం ప్రారంభించారు.

నత్త నడకన నమోదు

నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా ప్రతి విద్యార్థికి జీవితకాల గుర్తింపు సంఖ్యతో అపార్ కార్డు జారీ చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా 1165 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో కలిపి 1,60,152 మంది విద్యార్థులకు అపార్ కార్డులు పంపిణీ చేయాల్సి ఉంది. కానీ జిల్లాలో నమోదు ప్రక్రియ నత్త నడకన సాగుతున్నట్లు అధికారిక లెక్కలే తెలుపుతున్నాయి. జిల్లాలో 109 పాఠశాలలు మాత్రమే కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభించగా మొత్తం మీద కేవలం సుమా రు 5 వేల మంది విద్యార్థుల నమోదు ప్రక్రియ మాత్రమే పూర్తి అయినట్లు తెలుస్తోంది. కార్డుల జారీకి కష్టాలు తప్పడం లేదు.

రికార్డులకు సరిపోలని వివరాలు

చాలా మంది విద్యార్థుల వివరాలు పాఠశాల రికార్డుల్లో ఒక రకంగా ఉండగా ఆధార్ కార్డుల్లో మరో రకంగా ఉంటున్నాయని ప్రధానోపాధ్యాయులు తెలుపుతున్నారు. కొంత మంది వివరాలు మాత్రమే ఆధార్ కార్డులతో సరిపోతున్నాయని తెలుస్తోంది.

పిల్లలు చిన్న తనంలో ఉన్నపుడు ఆధార్ తీయడంతో ఆధార్ నమోదులోనే ఎక్కువగా తప్పులు ఉంటున్నాయని ఉపాధ్యాయ వర్గాలు పేర్కొంటున్నారు. విద్యార్థులకు అపార్ నెంబరు ఆన్‌లైన్‌లో కేటాయించాలంటే విద్యార్థి జనన ధ్రువీకరణ పత్రంలో గల వివరాలకు, ఆధార్‌లో ఉన్న వివరాలకు, పాఠశాల అడ్మిషన్ రికార్డుల్లో గల వివరాలకు సరిపోవాలి. మూడింటి వివరాలు సరి పోతేనే అపార్ నెంబర్లు జనరేట్ అవుతున్నాయి. ఈ మూడింటిలో విద్యార్థుల వివరాలు సరిపోకపోతే ఆ విద్యార్థికి ఆన్ లైన్‌లో అపార్ నెంబరు జనరేట్ కావడం లేదు. దీంతో ప్రధానోపాధ్యాయులు తలలు పట్టుకునే పరిస్థితి వచ్చింది.

అపార్ నమోదు కొనసాగుతుంది

మండల విద్యాధికారి ప్రభాకర్



విద్యాశాఖ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు మండలంలో అపార్ నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. కొన్ని సాంకేతిక కారణాల వలన ఆన్ లైన్ మందకొడిగా సాగుతోంది. విద్యార్థుల అన్ని వివరాలు సరిపోలితేనే అపార్ జనరేట్ అవుతుంది. త్వరితగతిన పూర్తి చేయాలని ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశాం.

ఎదురెదురుగా ఢీకొన్న లారీలు

- క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్లు
- ముగ్గురికి గాయాలు.. ఆసుపత్రికి తరలింపు


ప్రమాద స్థలంలో డ్రైవర్లను బయటకు తీస్తున్న పోలీసులు

మల్యాల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కరీంనగర్-జగిత్యాల మార్గంలోని కొండగట్టు సమీపంలో శుక్ర వారం వేకువజామున ఎదురెదురుగా వస్తున్న రెండు లారీలు ఢీకొన్న సంఘటనలో ముగ్గురికి గాయాల య్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. రాజస్థాన్ నుంచి కరీంనగర్ వైపు వెలుతున్న లారీ, ఆంధ్ర ప్రదేశ్‌లోని ఎన్టీయార్ జిల్లా నుంచి పత్తి లోడ్‌తో జగిత్యాల వైపు వస్తున్న లారీ రెండు కొండగట్టు సమీపంలో ఢీకొన్నాయి. ఈ సంఘటనలో రెండు లారీల ముందు భాగాలు నుజ్జు నుజ్జు కావడంతో క్యాబిన్‌లో డ్రైవర్లు దేవీలాల్, వీరయ్యలు ఇరుక్కు పోయారు. దీంతో పలువురు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు జేసీబీ సహాయంతో క్యాబిన్‌లో ఇరుక్కొని తీవ్ర గాయాలపాలైన డ్రైవర్లను బయటకు తీశారు. వారితో పాటు లారీలో గల మరో వ్యక్తి శ్రీనివాస్ రెడ్డికి కూడా గాయాలు కాగ గాయపడిన వారిని చికిత్స కోసం జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.


క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్

సిగరెట్ తాగవద్దన్నందుకు

ఉరేసుకొని విద్యార్థి ఆత్మహత్య

కోనరావుపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు సిగరెట్ తాగవద్దన్నారని పదో తరగతి విద్యార్థి శుక్రవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం సుద్దాల గ్రామానికి చెందిన అలువాల వెంకటేష్ (16) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. కొద్ది రోజులుగా సిగరెట్‌కు అలవాటు పడ్డాడు. ఈ విషయమై గతంలో తల్లిదండ్రులు మందలించగా పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స చేయించడంతో కోలుకున్నాడు. అప్పటి నుంచి తల్లిదండ్రులు, స్నేహితులతో ముభావంగా ఉంటున్నాడు. గురువారం సిగరెట్ తాగవద్దని, చదువుకోవాలని తల్లిదండ్రులు సూచించారు. దీంతో తరుచూ తనను సిగరెట్ తాగవద్దంటున్నారని కోపంతో శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు చేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రశాంత్ రెడ్డి ఉన్నారు.


ఆటోను బయటకు తీస్తున్న పోలీసులు

ఘాట్‌రోడ్డుపై అదుపు తప్పిన ఆటో

- విద్యుత్ స్థంభానికి ఢీ
- అంజన్న దర్శనం చేసుకొని వెలుతుండగా ఘటన

మల్యాల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజన్న దర్శనం చేసుకొని తిరిగి వెలుతున్న భక్తుల ఆటో ఘాట్ రోడ్డుపై అదుపు తప్పి విద్యుత్‌స్థంబానికి ఢీకొంది. మంచిర్యాల జిల్లాలోని మందమర్రికి చెందిన ఓ కుటుంబం దైవదర్శనం నిమిత్తం కొండగట్టుకు వచ్చి వెలుతుండగా గతంలో ఆర్టీసీ బస్సు ప్రమాదం జరిగిన చోట ఆటో అదుపుతప్పి ఘాట్‌రోడ్డు పక్కన గల విద్యుత్‌స్థంభానికి ఢీకొని గతంలో ప్రమాదాల నివారణకు ఏర్పాటు చేసిన రక్షణగోడ వద్ద నిలిచింది. ఈ ప్రమాదంలో ఆటోలో గల వారందరూ క్షేమంగా బయట పడ్డారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఆటోను జేసీబీ సహాయంతో రక్షణగోడ నుంచి లాగి బయటకు తీశారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

- సీఎం సభ ముట్టడికి బీసీ సంఘం పిలుపు
- పలు పార్టీల మద్దతు కోరుతున్న నాయకులు

గణేశ్‌నగర్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని కరీంనగర్‌లో జరిగే సీఎం సభ ముట్టడికి బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ ఆధ్వర్యంలో పలు రాజకీయ పార్టీలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు ప్రతిపక్ష నాయకులకు విద్యార్థుల సమస్యలు వివరిస్తూ గత 3 సంవత్సరాల నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయడం లేదని దీనివలన విద్యార్థులకు ఇబ్బంది కలుగుతుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వెంటనే ఫీజు బకాయిలు విడుదల చేసి విద్యార్థుల ఇబ్బందులు తొలగిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి 10 నెలలు గడిచినా ఇప్పటికీ ఫీజు బకాయిలు విడుదల చేయడం లేదని తెలిపారు. మూసీ సుందరీకరణ చేస్తామని చెప్పే ప్రభుత్వం విద్యార్థులను మాత్రం గాలికి వదిలేస్తున్నదన్నారు. కరీంనగర్‌లో త్వరలో జరుగనున్న సీఎం సభను బీసీ సంక్షేమ సంఘం, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ముట్టడిస్తామని హెచ్చరించారు. దీనికి పలు రాజకీయ పార్టీలు వారి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు హామీ ఇచ్చారన్నారు. యువజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు సంజీవ్‌రాజు ఆధ్వర్యంలో పలు రాజకీయ పార్టీల మద్దతు కోరారు.

వ్యవసాయ మోటార్ల చోరీ

ఇల్లంతకుంట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దలింగాపూర్‌లో వ్యవసాయ బావుల వద్ద నుంచి ఇద్దరు రైతులకు చెందిన మోటార్లు చోరీకి గురయ్యాయి. గ్రామస్థుల వివరాల ప్రకారం కేతిరెడ్డి నవీన్‌రెడ్డి, కేతిరెడ్డి రాంరెడ్డి వ్యవసాయ బావుల వద్ద గదులు నిర్మించుకొని వ్యవసాయ పరికరాలు అందులో ఉంచారు. గుర్తుతెలియని వ్యక్తులు గురువారం రాత్రి తాళాలు పగలగొట్టి వ్యవసాయ మోటార్లు, పంపులు, విద్యుత్ వైర్లను ఎత్తుకెళ్లారు. మరో రైతు కేతిరెడ్డి మధుసూదన్‌రెడ్డికి చెందిన గది తాళాలు పగలగొట్టడానికి ప్రయత్నించారు. దాదాపు 1.30 లక్షల మోటార్లు చోరీకి గురైనట్లు రైతులు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ సంఘటన స్థలాన్ని పరిశీలించినట్లు చెప్పారు.

అంజన్న హుండీల లెక్కింపులో నిర్లక్ష్యం..



మల్యాల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం హుండీల లెక్కింపు సందర్భంగా పర్యవేక్షణపై నిర్లక్ష్యం కనబడుతోంది. తరచూ దొంగతనాలు చోటు చేసుకుంటున్నప్పటికీ లోపాలు సరిద్దికపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా గురువారం హుండీల లెక్కింపు చేపట్టగా నోట్ల లెక్కింపు పూర్తి అయ్యాక అనుమానం వచ్చిన కొందరి అభ్యంతరం మేరకు మళ్లీ లెక్కింపు చేయడంతో సుమారు రూ. పది వేల వరకు ఎక్కువ వచ్చిన్నట్లు కొండపై చర్చించు కుంటున్నారు. కోటికి పైగా ఆదాయం రాగా అందులో 90శాతం నోట్లు ఉంటాయి. ఈ రకంగా మొత్తం లెక్కింపు చేపట్టిన నోట్లను రీకౌంటింగ్ చేస్తే ఇంకా ఎక్కువగా నోట్లు రావచ్చుననే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అలాగే ఆలయ సిబ్బం ది ఒకరు చేతిలో వస్తువులను ఉంచు కోవడంతో అక్కడి మిగితా సిబ్బందికి అనుమానం రాగా గుర్తించిన అత ను దాన్ని కౌంటింగ్ డబ్బాలో వేశాడని, కొందరు దాన్ని ఫొటోలు కూడా తీసినట్లు చర్చించుకుంటున్నారు.

ఆయన చేతిలో ఉన్న దానిని బంగారంగా అనుమా నిస్తున్నారు. ఈ విషయమై ఆలయ ఈవో రామకృష్ణ రావును ఫోన్‌లో సంప్రదించడానికి ప్రయత్నించగా అందుబాటులో లేరు. గతంలోనూ లెక్కింపు సమయంలో సిబ్బంది చేతివాటానికి పాల్పడిన సంఘటనలు ఉండగా కౌంటిం గ్ ప్రక్రియపై తరచూ విమర్శలు వస్తూనే ఉన్నాయి. హుండీల కౌంటింగ్ సందర్భంగా దేవస్థానం అధికారులు దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, సీసీ కెమెరాల పర్యవేక్షణలో దేవస్థానం అధికారులకు తోడు పోలీసుల సమక్షంలో కౌంటింగ్ చేపడుతుంటారు. ఈ లెక్కింపునకు వివిధ ట్రస్ట్‌లకు సంబంధించిన సిబ్బంది నోట్లు లెక్కింపు, నోట్లు వేరు చేస్తుండగా పర్యవేక్షణ అంతంతమాత్రమేనని అందుకే తరచూ ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నట్లు చర్చ జరుగుతోంది.

నోట్ల లెక్కింపులోనూ పర్యవేక్షణ కరువు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

ప్రతిభ చాటిన విద్యార్థినికి అభినందన


రష్మితను అభినందిస్తున్న కళాశాల అధ్యాపకులు

హుజూరాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం తృతీయ సంవత్సరం చదువుతున్న నల్లగొండ రష్మిత అనే విద్యార్థిని 10 కిలో మీటర్ల ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ క్రాస్ కంట్రీ ఛాంపియన్‌షిప్ ఈవెంట్లో ప్రతిభ చాటడంతో శుక్రవారం ప్రిన్సిపాల్ ఇందిరాదేవి అభినందించారు. రష్మిత శాతవాహన యూనివర్సిటీ తరుపున గురువారం కర్ణాటకలోని మంగళూరు యూనివర్సిటీలో నిర్వహించిన క్రీడా పోటీలో పాల్గొన్నది. ప్రతిభ చాటిన రష్మితను కళాశాల ప్రిన్సిపాల్ ఇందిరాదేవి, సమన్వయకర్త మంగమ్మ, వైస్ ప్రిన్సిపాల్ మల్లారెడ్డి, అధ్యాపకులు లింగారెడ్డి, రేణుక, మైపాల్‌రెడ్డి, ఓదెలు, ఝాన్సీరాణి, సుమలత, స్వరూపరాణి, రమ, పల్లవి, స్వప్న అభినందించారు.

24న రిటైర్డ్ ఫారెస్ట్ గెజిటెడ్ ఆఫీసర్ల సంఘం సమావేశం

సుభాష్‌నగర్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఫారెస్ట్ గెజిటెడ్ ఆఫీసర్ల సంఘం సమావేశాన్ని ఈ నెల 24న నిర్వహించను న్నట్లు సంఘం ప్రధానకార్యదర్శి మహేందర్ రాజు తెలిపారు.

శుక్రవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి సంవత్సరం మొదటి విడత సమావేశం వరంగల్‌లో, రెండో విడత సమావేశాన్ని కరీంనగర్‌లో నిర్వహిస్తున్నామని తెలిపారు. మానకొండూరులో నిర్వహించే ఈ సమావేశంలో కార్యవర్గ ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. అంతే కాకుండా సీనియర్ సిటిజన్స్ ఎదుర్కొంటున్న సమస్యలు, సంఘం ఆధ్వర్యంలో చేపట్టబోయే భవిష్యత్ కార్యక్రమాల గురించి చర్చిస్తామన్నారు. ఈ సమావేశంలో సలహాదారుడు బుచ్చిరెడ్డి, చక్రపాణి, రాజగోపాల్, మధుసూదన్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మహేందర్‌రాజు

దాడి ఘటనలో కేసు నమోదు

కరీంనగర్ క్రైం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ భారత్ టాకీస్ వద్ద గురువారం అర్ధరాత్రి జరిగిన దాడి ఘటనలో నిందితులపై కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ వన్ టౌన్ సిఐ బిల్లాకోటేశ్వర్ తెలిపారు. పెళ్లి భరత్‌లో జరిగిన గొడవను దృష్టిలో పెట్టుకొని సాహిత్ యాదవ్ అనే వ్యక్తి తన సోదరుడు రిచు, మరో ముగ్గురి స్నేహితులతో కలిసి చింతల విజేందర్ రెడ్డి అనే వ్యక్తిపై కె ఎస్‌ఎల్ లాడ్జి కారిడార్‌లో రాడ్డుతో ముఖం మీద దాడి చేసి గాయపరిచినట్లు తెలిపారు. అడ్డు వచ్చిన వారిని కూడా కొట్టాడని, ఈ మేరకు బాధితుడు విజయేందర్‌రెడ్డి శుక్రవారం ఫిర్యాదు చేశాడని తెలిపారు. ఈ దాడి ఘటనలో నిందితులైన ఐదుగురు వ్యక్తుల పై కేసు నమోదు చేశామన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒకరికి మూడు రోజులు జైలు శిక్ష

సైదాపూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒకరికి మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ హుజూరాబాద్ కోర్టు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఈశ్వరయ్య శుక్రవారం తీర్పునిచ్చారు. సైదాపూర్ ఎస్సై సీహెచ్ తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా సైదాపూర్ మండలం వెంకటేశ్వర్లపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మద్యం తాగి బండి నడుపుతూ పట్టుబడ్డాడు. అతడిని కోర్టులో హాజరు పరుచగా మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై తెలిపారు.


చెక్కును అందిస్తున్న వధూవరులు

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఔదార్యం

ప్రభుత్వ పాఠశాలలో వాటర్ కూలర్ల కోసం రూ.50 వేల విరాళం

సుల్తానాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తన వివాహన్ని పురస్కరించుకుని ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ విరాళం ప్రకటించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం రెండు వాటర్ కూలర్లను సమకూర్చుకునేందుకు యాభై వేల రూపాయలను అందించారు. సుల్తానాబాద్‌కు చెందిన బూడిద స్వామి కరీంనగర్ ఆర్టీసీలో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. ఆయన కుమారుడు ప్రియతమ్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా హైదరాబాద్‌లో పని చేస్తున్నారు. ప్రియతమ్ వివాహం పురస్కరించుకుని వారు స్థానిక ప్రభుత్వ పాఠశాలకు రెండు వాటర్ కూలర్లను సమకూర్చాలని భావించారు. ఈ మేరకు వివాహ వేడుక వేదికపైన సంబంధిత ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శారదకు యాభై వేల రూపాయల చెక్కును శుక్రవారం నూతన దంపతులు ప్రియతమ్- షరిష్మాలు అందజేశారు. హెచ్‌ఎంతో పాటు వేదికపై ఉన్న మాజీ జడ్పీటీసీ అయిల రమేష్, మున్సిపల్ వైస్‌చైర్ పర్సన్ బిరుదు సమత క్రిష్ణ అభినందించారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

వేములవాడ కల్చరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. కార్తీక మాసం సందర్భంగా ఆయా ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రాజన్న ఆలయ కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించి ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనంతరం పార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. రాజన్న ఆలయంలోని గండదీపంలో నూనెపోస్తూ గండాలు తొలగిపోవాలని వేడుకున్నారు. అనుబంధ ఆలయాల్లో కుంకుమపూజలో పాల్గొని, బద్దిపోచమ్మను దర్శించుకొని తిరిగి ప్రయాణమయ్యారు. ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రాజన్నను దర్శించుకున్న మధుప్రియ



సింగర్ మధుప్రియకు ఆశీర్వచనం చేస్తున్న అర్చకులు

వేములవాడ రాజరాజేశ్వర స్వామిని సింగర్ మధుప్రియ శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం, రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. ఆమె వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ తదితరులు ఉన్నారు.

రామగుండంకు నర్సింగ్ కళాశాల

- రూ.26కోట్లు మంజూరు చేస్తూ జీవో జారీ



సింగరేణి మెడికల్ కళాశాల

కళ్యాణ్‌నగర్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రామగుండంలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఏర్పాటు కానున్నది. నర్సింగ్‌కళాశాలను మంజూరు చేస్తూ ప్రభుత్వం శుక్రవారం జీవో నంబరు 183ను జారీ చేసింది. ఏడాదికి 60సీట్ల కెపాసిటీతో ఈ కళాశాలను ఏర్పాటు చేస్తున్నారు. సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్(సిమ్స్) కు అనుబంధంగా ఈ కళాశాల ఏర్పాటు కానున్నది. ఈ మేరకు శుక్రవారం వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టియానా జెడ్ చుగుంత్ ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీజీఎంఎస్‌ఐడీసీ) ఆధ్వర్యంలో నిర్మాణం జరుగనున్నది. కళాశాల నిర్మాణం, సామాగ్రి కొనుగోలుకు రూ.26కోట్లు మంజూరు ఇచ్చారు. ఈ విద్యా సంవత్సరం నుంచే కళాశాల నిర్వహించేలా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. మెడికల్ కళాశాలకు అనుబంధంగా నర్సింగ్, బీడీఎస్, పారా మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి గతంలో విజ్ఞప్తి చేశారు. డెంటల్ కళాశాల కూడా మంజూరయ్యే అవకాశం ఉన్నది.

ఒగ్గుకథలో దిట్ట..

పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలంలోని పెగడపల్లి గ్రామానికి చెందిన గోపగోని చంద్రమౌళిగౌడ్.. కులవృత్తికి భిన్నంగా ఒగ్గుకథలపై మక్కువ పెంచుకున్నాడు. అప్పట్లో అంతర్జాతీయ ఒగ్గుకథ కళాకారుడు మిద్దెరాములును స్ఫూర్తిగా తీసుకున్నాడు. తన అన్న వద్ద ఒగ్గుకథలు చెప్పడం నేర్చుకున్నాడు. గ్రామాల్లో జరిగే వివిధ కార్యక్రమాల్లో ఒగ్గుకథను ప్రదర్శిస్తూ ఎన్నో ఏళ్లుగా ప్రశంసలందుకుంటున్నాడు.

- మిద్దెరాములు స్ఫూర్తితో కళాసాధన.. వేల సంఖ్యలో ప్రదర్శనలు..
- ఉత్తమ కళాకారుడిగా గోపగోని చంద్రమౌళిగౌడ్‌కు జాతీయ స్థాయి అవార్డు





ఒగ్గుకథను ప్రదర్శిస్తున్న చంద్రమౌళిగౌడ్

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలంలోని పెగడపల్లి గ్రామానికి చెందిన గోపగోని చంద్రమౌళిగౌడ్ ఒగ్గుకథ కళాకారుడిగా రాణిస్తున్నాడు. 20 ఏళ్ల వయస్సులో మిద్దె రాములు స్ఫూర్తితో చంద్రమౌళిగౌడ్ ఒగ్గుకథ నేర్చుకున్నాడు. చిన్నతనంలోనే జానపద గేయాలు పాడే చంద్రమౌళి ఒగ్గుకథ నేర్చుకోవాలని ఆలోచనతో మిద్దె రాములును స్ఫూర్తిగా తీసు కున్నాడు. ఒగ్గు కథ కళాకారుడైన తన అన్న గోపగోని ఓదెలు వద్ద శిష్యరికం చేసి ఒగ్గు కథను నేర్చుకున్నాడు. తర్వాత బృందాన్ని ఏర్పాటు చేసుకొని గత 26 సంవత్సరాలుగా రాష్ట్రవ్యాప్తంగా రెండు వేలకు పైగా ప్రదర్శనలిచ్చి ప్రజల మన్ననలు పొందాడు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఒగ్గు కథ ద్వారా ప్రజల్లో చైతన్యం నింపి ప్రజా గాయకుడు గద్దర్ ప్రశంసలందుకున్నాడు.

అప్పట్లో హైదరాబాద్ జరిగిన కళోత్సవాల్లో ఒగ్గు కథ చెప్పి ఉత్తమ ఒగ్గుకథ అవార్డును అప్పటి ప్రభుత్వ సలహాదారుడు కేవీ రమణ చారి చేతుల మీదుగా అందుకున్నాడు. ప్రభుత్వ కార్య క్రమాలు, ఎయిడ్స్, అక్షరాస్యత, కుటుంబ నియం త్రణ, మద్య పాన నిషేదంపై ప్రభుత్వం నిర్వహించిన వివిధ కార్యక్రమాల్లో పాల్గొని పలువురి ప్రశంసలు అందుకున్నాడు. చంద్రమౌళిగౌడ్‌కు భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. స్వగ్రామంలో ఓ వైపు హోటల్ నడిపించుకుంటూ మరోవైపు గ్రామాల్లో జరిగే వివిధ కార్యక్రమాల్లో చంద్రమౌళిగౌడ్ ఒగ్గు కథ ప్రదర్శనలు ఇస్తున్నాడు.

న్యూస్ బాక్స్

గోదావరి మహా హారతి పోస్టర్ ఆవిష్కరణ

ధర్మపురి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం ఎదుట గోదావరి మహాహారతి వాల్ పోస్టర్‌ను ఉత్సవ సమితా రాష్ట్ర కో కన్వీనర్ దామెర రాంసుధాకర్‌రావు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాంసుదాకర్‌రావు మాట్లాడుతూ ధర్మపురి క్షేత్రంలో 13 ఏళ్లుగా గోదావరి మహా హారతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నవంబర్ 30 శనివారం సాయంత్రం జరిగే గోదావరి మహా హారతి కార్యక్రమానికి విశ్వహిందూ మహా సంఘ్ భారత్, శ్రీలంక అద్వైత పీఠా ధిపతి, పూజ్య శ్రీ అతిథేశ్వరానంద పర్వత హాజరవుతారని పేర్కొన్నారు. బ్రహ్మశ్రీ పాలెపు భరత్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి రాష్ట్ర కన్వీనర్ లింగంపెల్లి వీరగోపాల్, కో కన్వీనర్ బల్మూరి సంతోష్‌రావు హాజరవుతారని తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో గోదావరి హారతి ఉత్సవ సమితి జిల్లా కన్వీనర్ శ్రీనివాస్, సభ్యులు సురేం దర్‌రెడ్డి, నర్సింహమూర్తి, లక్ష్మీనర్సయ్యగౌడ్, వీహెచ్‌పీ, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు కస్తూరి రాజన్న, సంగి నర్సయ్య పాల్గొన్నారు.

మిడ్ మానేరు నిర్వాసితులను కేసీఆర్ ప్రభుత్వం మోసగించింది

- కాంగ్రెస్ ప్రభుత్వమైన ఆదుకోవాలి - సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి వేణు

సిరిసిల్ల టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మిడ్ మానేరు నిర్వాసితులకు ఇళ్లు నిర్మించుకోవడం కోసం గత కేసీఆర్ ప్రభుత్వం రూ. 5లక్షల 4వేలు ఇస్తామని మాట ఇచ్చి మోసం చేసిందని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణం సీపీఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వేణు మాట్లాడారు. మిడ్ మానేరు కోసం 12 వేల కుటుంబాలు ఇళ్లు, వ్యవసాయ భూములు కోల్పోయారని 25 టీఎంసీల నీటి నిల్వకు సహకరించిన నిర్వాసిత కుటుం బాలను ఆదుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందన్నారు. త్యాగాలు చేసిన మిడ్ మానేరు నిర్వాసితులను గత కేసీఆర్ ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. నిర్వాసితులందురు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకొని వేములవాడ, మానకొండూరు, చొప్పదండి నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోవడం కోసం కృషి చేశారన్నారు. మిడ్ మానేరు నిర్వాసితులందరికీ రూ. 5లక్షల 4వేలు ఇవ్వాలన్నారు. 1200వేల మంది నిర్వాసిత కుటుంబాలు ఉంటే కేవలం 4,696 మంది కుటుంబాలకే ఇవ్వడం అనేది బాధాకరమన్నారు. అప్పులు చేసి ఇళ్లు నిర్మాణం చేసుకున్న కుటుంబాలు వడ్డీలు కట్టలేక ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం ఇళ్లు నిర్మించుకోవడానికి జీవో ఉన్న విషయాన్ని ప్రభుత్వం మరిచిపోవద్దన్నారు. తరతరాలకు నీరు అందించే మిడ్ మానేరు నిర్మాణం కోసం త్యాగాలు చేసిన నిర్వాసితులందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 5 లక్షల 4 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 18 సంవత్సరాలు నిండిన యవతీయువకులకు రావాల్సిన కుటుంబ ప్యాకేజీ రూ.2 లక్షలు, నిరుద్యోగ భృతి తక్షణమే ఇవ్వాలన్నారు. లేని పక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళలు చేపడతా మన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పంతం రవి, సోమ నాగరాజు, శ్రావణపల్లి మల్లేశం, బాచుపల్లి శంకర్ పాల్గొన్నారు.

21వ రోజు ఘనంగా గోదావరి హారతి



ధర్మపురి వద్ద గోదావరి హారతి ఇస్తున్న అర్చకులు

ధర్మపురి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి వద్ద గోదావరి హారతి 21వ రోజు శుక్రవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు, అర్చకులు, సిబ్బంది, నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి హారతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, వేదపండితులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు క్రీడాపాఠశాల విద్యార్థులు



క్రీడాపాఠశాల విద్యార్థులతో కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14, 17 అథ్లెటిక్స్ పోటీలకు కరీంనగర్ జిల్లా కేంద్రంలోని క్రీడాపాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల ఖమ్మం, హనుమకొండలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో క్రీడాపాఠశాల విద్యార్థులు దీపిక, రేవతి, వైశాలి, జాహ్నవి పతకాలను సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 26 నుంచి 30 వరకు ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో నిర్వహించే పోటీల్లో పాల్గొననున్నారు.

- ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో కాంస్య పతకం సాధించిన నెల్లి అనిహశ్రీ రాజ్‌కోట్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా క్రీడాకారులను కలెక్టర్ అభినందించారు. జాతీయస్థాయి పోటీలకు వెళ్లే క్రీడాకారులను ఉత్తేజపరి చేందుకు కలెక్టర్ లగేజ్ బ్యాగులను అందించి ప్రోత్సహించారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, అథ్లెటిక్స్ కోచ్ పవన్, స్విమ్మింగ్ కోచ్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్లలో అధికారుల తనిఖీలు



తనిఖీ చేస్తున్న అధికారులు

సిరిసిల్ల టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎం వసంతరావు ఆధ్వర్యంలో శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలోని స్కానింగ్ సెంటర్లను అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో అంజలి జిల్లా పరిధిలోని స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేశారు. స్కానింగ్ సెంటర్లలోని రికార్డులను, ఆడిట్ రికార్డులను, రిపోర్ట్‌లను పరిశీలించారు. నిబంధనలు అనుసరించి స్కానింగ్ సెంటర్లను నిర్వహించాలని సూచించారు. స్కానింగ్ మిషన్లను సర్టిఫికెట్లలో రిజిస్ట్రేషన్ తప్ప నిసరిగా ఉండాలని లేకుంటే స్కానింగ్ మిషన్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు. తనిఖీలలో హెచ్‌ఈ బాలయ్య, సీహెచ్‌వో బాలచంద్రం పాల్గొన్నారు.

నేటి పరిస్థితుల్లో కరాటే మార్షల్ ఆర్ట్స్ తప్పనిసరి

- మహిళలకు ఆత్మరక్షణ క్రీడగా కరాటే - సినీ హీరో సుమన్ - ప్రారంభమైన జాతీయస్థాయి కరాటే పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న కృష్ణంరాజు సతీమణి శారదాదేవి, హీరో సుమన్

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నేటి పరిస్థితుల్లో ప్రతి ఒక్కరికీ కరాటే మార్షల్ ఆర్ట్ తప్పనిసరి అని సినీ హీరో సుమన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో శుక్రవారం నుంచి మూడు రోజులపాటు జరగనున్న కృష్ణంరాజు మెమోరియల్ జాతీయస్థాయి కరాటే పోటీలను ఆయన జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించి మా ట్లాడారు. ప్రపంచంలోనే నెంబర్ వన్ క్రీడగా కరాటే వెలుగొందుతుందన్నారు. మహిళలకు ప్రత్యే కించి బాలికలకు మార్షల్ ఆర్ట్ ఒక ఆత్మరక్షణ క్రీడగా ఉపయోగపడుతుందన్నారు. కరాటేతో శారీరక పటుత్వం పెంపొందుతుందని, విద్యార్థి దశలో ప్రతి ఒక్కరూ కరాటేలో శిక్షణ పొందాలన్నారు. మరో అతిథి సినీ హీరో కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి మాట్లాడుతూ కరాటేతో మానసిక ఉల్లాసం, ఆత్మవిశ్వాసం పెంపొం దుతాయన్నారు. పాఠశాల స్థాయిలో కరాటే ను ప్రభుత్వాలు తప్పనిసరి క్రీడగా చేయా లని సూచించారు. జాతీయస్థాయి పోటీల నిర్వాహకుడు, కాయ్ జాతీయ సంయుక్త కార్యదర్శి, రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలోని 15 రాష్ట్రాల నుంచి వెయ్యి మంది క్రీడకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని అన్నారు. ఈ కార్యక్ర మంలో సీఎస్‌కే చైర్మన్, కరాటే సంఘం జిల్లా అధ్యక్షుడు చల్ల హరిశంకర్, జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్, ఒలంపిక్స్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, కాయ్ చైర్మన్ కే వసంత్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గౌరు రాజిరెడ్డి, కరాటే సీనియర్ మాస్టర్ వేణుగో పాల్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాడుగుల ప్రవీణ్, జిల్లా కార్యదర్శి ఆర్ ప్రసన్న కృష్ణ, కోశాధికారి వంగల శ్రీధర్, అన్వర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



పోటీల్లో తలపడుతున్న చిన్నారులు

రేపటి నుంచి కాచిగూడకు ప్రత్యేక రైళ్లు

కరీంనగర్ రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నుంచి కాచిగూడకు ఆదివారం నుంచి ప్రత్యేక రైళ్లు నడిపునస్తున్నట్లు కరీంనగర్ రైల్వే స్టేషన్ మేనేజర్ రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌ఆర్‌బీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల కోసం ఈ ప్రత్యేక రైళ్లను దక్షిణ మధ్య రైల్వే నడుపుతున్నట్లు ఆయన తెలిపారు. ఈనెల 24, 25, 26, 28 తేదీల్లో కరీంనగర్ రైల్వేస్టేషన్‌లో ఉదయం ఆరు గంటలకు ప్రత్యేక రైలు బయలుదేరి మధ్యాహ్నం రెండు గంటలకు కాచిగూడకు చేరుకుంటుందన్నారు. తిరిగి మధ్యాహ్నం మూడు గంటలకు కాచిగూడ నుంచి బయలుదేరి రాత్రి 11.15 గంటలకు కరీంనగర్‌కు చేరుకుటుందని ఆయన పేర్కొన్నారు. ప్రయాణికులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

చిన్న వయస్సు.. పెద్ద మనసు

- బర్త్‌డే, డిసెంబరు 31 వేడుకలకు దూరం
- ఆ డబ్బుతో పేదలకు సేవా కార్యక్రమాలు
- జ్యోతిక, కౌశిక్‌ల ఉదారతకు ప్రశంసలు
- రాష్ట్ర, జాతీయ స్థాయిలో పురస్కారాలు



దివ్యాంగులకు వీల్‌చైర్ అందిస్తున్న జ్యోతిక, కౌశిక్

పుట్టిన రోజు, డిసెంబరు 31 వేడకుల పేరిట డబ్బులు వృథా చేయవద్దని, ఆ డబ్బుతో పేదలకు ఏదైనా సహాయం చేయాలన్నది ఆ చిన్నారుల సంకల్పం. కరోనా విపత్తు సమయంలో పేదలు తిండి లేక పస్తులున్న నిస్సహాయ స్థితి వారిని కదలించింది. తల్లిదండ్రులు ఇచ్చే పాకెట్ మనీని దాచి పెట్టి ఆ డబ్బులతో పేదలకు నిత్యావసర సరుకులను అందించారు సుల్తానాబాద్ పట్టణానికి చెందిన జ్యోతిక, కౌశిక్. వారి సేవాగుణానికి గుర్తించిన వివిధ సంస్థలు రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులతో సత్కరించాయి.

సుల్తానాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వారి వయస్సు చిన్నదే అయినా మనసు పెద్దది. తమ పుట్టిన రోజు వేడుకలను, ఇయర్ ఎండింగ్ సెలబ్రేషన్స్ జరుపుకోకుండా ఆ డబ్బుతో పేదలకు సహాయం చేయాలని భావించారు. అలా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించి పలువురి మన్ననలు పొందారు. కరోనా సమయంలో ప్రైవేట్ పాఠశాలలు మూతపడడం, యాజమాన్యాలు వేతనాలు చెల్లించకపోవడంతో ప్రైవేట్ టీచర్ల కుటుంబాల పోషణ భారంగా మారింది. ఈ నేపథ్యంలో దాదాపు 207 మంది టీచర్లకు పలువురు దాతల సహకారంతో నిత్యావసర సరుకులు అందించారు. కరోనా బాధితులకు సేవలందించారు. 167 మంది కరోనా పేషంట్లకు అవసరమైన పాలు, బ్రెడ్లు, పండ్లు అందించారు. అవసరమైన వారికి భోజనాలు సమకూర్చారు. టీచర్స్ డే సందర్భంగా ఉపాధ్యాయులకు ఏదైనా సహాయం చేయాలని వారు ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్త స్పందన లభించింది.



పేదలకు నిత్యావసర సరుకులు అందిస్తున్న చిన్నారులు (ఫైల్)

● పుట్టిన రోజు వేడుకలు మానుకుని..

సుల్తానాబాద్ పట్టణంలోని ద్వారకానగర్‌కు చెందిన ఏగోలపు సదయ్య-సుజాత దంపతులకు ఇద్దరు సంతానం. కూతురు జ్యోతిక, కుమారుడు కౌశిక్‌లు తమ పదో ఏట నుంచి పుట్టిన రోజు జరుపుకోవడం మానుకొని వాటికయ్యే ఖర్చుతో పేదలకు ఏదైనా సేవ చేయాలని సంకల్పించారు. ఆర్థికంగా ఉన్న వారు కానీ, మధ్యతరగతి వారు కానీ తమ పిల్లల పుట్టిన రోజు పేరిట వేడుకలు నిర్వహించడం, వాటికి పెద్ద మొత్తంలో డబ్బులు ఖర్చు చేయడం సరికాదని జ్యోతిక కౌశిక్‌లు భావించారు. అలాగే డిసెంబర్ 31 పేరిట వృథా ఖర్చు చేయవద్దని, ఆ డబ్బుతో పేదలకు సహాయం చేయాలని, తాము దీనిని ఆచరిస్తున్నామంటూ చేసిన చాలెంజ్ చాలా మంది పిల్లలను ఆలోచింపజేసింది. దాంతో వారు కూడా సేవా కార్యక్రమాలు చేపట్టారు.

● పాకెట్ మనీతో పాటు దాతల సహకారం..

తల్లిదండ్రులు ఇచ్చే పాకెట్ మనీతో పాటు దాతల సహకారంతో జ్యోతిక, కౌశిక్‌లు సుల్తానాబాద్ పట్టణమే కాకుండా పెద్దపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా తమ సేవా కార్యక్రమాలను చేపట్టారు. అనేక మంది పేద విద్యార్థుల ఫీజులు చెల్లించి ఆదుకున్నారు. వికలాంగులకు అవసరమైన పరికరాలు అందించారు. పేదలకు నెలరోజుల పాటు సరిపడా నిత్యావసర సరుకులు సమకూర్చారు. పండుగల సందర్భంలో కొత్త బట్టలు అందించారు. చలికాలంలో అనాథలకు, యాచకులకు ఉన్ని దుస్తులు కొనిచ్చారు. ఇలా గత ఆరు సంవత్సరాల నుంచి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు.

● రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులు

జ్యోతిక, కౌశిక్‌లు చేస్తున్న సేవలకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. అనేక సంస్థలు వీరికి అవార్డులు ప్రకటించి సన్మానాలు చేశాయి. ఎంతో మంది ప్రముఖులు వీరి ఉదారతను ప్రశంసించి సన్మానించారు.



జ్యోతిక, కౌశిక్‌లను సన్మానిస్తున్న సినీ నటుడు సుమన్ (ఫైల్)

న్యూస్ బాక్స్

బీజేపీ సభ్యత్వ నమోదు

సుల్తానాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలోని మార్కెట్‌లో శుక్రవారం బీజేపీ సభ్యత్వ నమోదు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సభ్యత్వ నమోదు ప్రత్యేక పర్యవేక్షకులుగా సీనియర్ నాయకులు తంగెడ రాజేశ్వర్‌రావు కోదాటి రమణారావు, ఎర్రోళ్ల శ్రీకాంత్ పాల్గొన్నారు. బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు కూకట్ల నాగరాజు, వనజ, సతీష్, సదయ్య, సంపత్, సతీష్, సంతోష్, శంకరయ్య, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడే నాయకులకు ఓటేయాలి

ఓదెల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఎలాంటి స్వార్థం లేకుండా కార్మికుల కోసం కష్టపడే నాయకులకు ఓటేయాలని కాజీపేట్ ఇంజనీరింగ్ బ్రాంచ్ చైర్మన్ బిక్షపతి అన్నారు. మండలంలోని కొలనూర్ రైల్వే స్టేషన్ వద్ద శుక్రవారం ఎస్‌సీఆర్‌ఎంయు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. డిసెంబర్ 4 నుంచి 6 వరకు నిర్వహించనున్న ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్‌ను గెలిపించాలని కోరారు. అసిస్టెంట్‌కార్యదర్శి శైలేష్, మాజీ కార్యదర్శి రామనాథం, మీసాల శేఖర్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

సేవా సదన్ గౌరవాధ్యక్షుడి మృతి

మంథని, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీసీతారామ సేవా సదన్ గౌరవ అధ్యక్షుడిగా పనిచేస్తున్న డాక్టర్ సువర్ణలక్ష్మణ్‌రావు శుక్రవారం మృతిచెందారు. గతంలో వెటర్నరీ డాక్టర్‌గా, బీడీవోగా పని చేశారు. ప్రస్తుతం సదన్‌కు శాశ్వత గౌరవ అధ్యక్షుడిగా కొనసాగుతూ సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి పాలుపంచుకున్నారు.

ఉచిత పశువైద్య శిబిరం

మంథని, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పశుసమగ్ర అభివృద్ధి సంస్థ ఆదేశాల మేరకు మున్సిపల్ పరిధిలోని శ్రీరాంనగర్‌లో ఉచిత పశువైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ శంకర్, మంథని ఏడీ డాక్టర్ జీ. సంపత్‌రావు, గుంజపడుగు డాక్టర్ రవి, సూపర్‌వైజర్లు, గోపాల మిత్రలు, రైతులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ

కమాన్‌పూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జూలపల్లిలో యూత్ కాంగ్రెస్ మండల శాఖాధ్యక్షుడు రాజుకుమార్ యువకులకు షటిల్, నెట్, బ్యాట్స్, కాక్, షటిల్ కిట్లను అందజేశారు. పార్టీ గ్రామ శాఖాధ్యక్షుడు చొప్పరి సంతోష్, సాయి, కిట్టుగౌడ్, శివాజియాదవ్ ఉన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఆర్‌ఐ

కమాన్‌పూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండల ఆర్‌ఐగా రాజకట్ల స్రవంతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన గౌతమ్ కలెక్టరేట్‌కు బదిలీఅయ్యారు. తహసీల్దార్ వాసంతికి జాయినింగ్ ఆర్డర్‌ను స్రవంతి అందజేశారు.

అవగాహన..

పెద్దపల్లిటౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) ప్రపంచ యాంటీమైక్రోబియల్ నిరోధకత వారోత్సవాలలో భాగంగా జిల్లాలోని ఆర్‌ఎంపీ, పీఎంపీలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జి. అన్నప్రసన్నకుమారి, ప్రమోద్‌కుమార్ పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ వ్యాధి నిరోధకత ఎలా ఏర్పడుతుందో వివరించి, యాంటీ మైక్రోబియల్ నిరోధకత రాకుండా ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో వివరించారు. సమావేశంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్‌లు సుధాకర్‌రెడ్డి, శ్రీరాములు, ఆర్‌ఎంపీ, పీఎంపీల అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు అజీజ్, అధ్యక్షుడు శ్రీనివాస్‌మూర్తి, జనరల్ సెక్రటరీ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అన్నదానం

సుల్తానాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ వేణుగోపాల స్వామి ఆలయ ఆవరణలో ఉన్న సాంబశివ దేవాలయంలో అన్నదానం నిర్వహించారు.

నిరుపయోగంగా ప్రభుత్వ భవనాలు

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం.. - పట్టించుకోని అధికారులు



నిరుపయోగంగా ఉన్న పాత తహసీల్దార్ కార్యాలయ భవనం

ఎలిగేడు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఉన్న పలు ప్రభుత్వ భవనాలు వినియోగించకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని మెరుగైన విద్యను అందించేందుకు బాలికల పాఠశాల 15ఏళ్ల క్రితం బాలికల కోసం నిర్మించారు. సర్వే నంబర్ 870 ప్రభుత్వం భూమిలో బాలికలకు వసతులు ఉండే విధంగా 12గదులతో రెండంతస్తుల భవనం నిర్మించి కేటాయించకపోవడంతో 4ఏళ్లపాటు మండల రెవెన్యూ కార్యాలయాన్ని నిర్వహించారు. అనంతరం రెవెన్యూ కార్యాలయం సొంత భవనంలోకి మార్చడం వలన 3ఏళ్ల నుంచి నిరుపయోగంగా మారింది. అలాగే బలహీన వర్గాలవసతి గృహాన్ని అన్ని హంగులతో రెండస్తుల భవనం నిర్మించినప్పటికీ ప్రస్తుతం వినియోగంలేక గత 6ఏళ్ల నుంచి అస్తవ్యస్తంగా మారి శిథిలావస్థకు చేరుకున్నాయి. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన భవనాలు ఉపయోగంలో లేకపోవడం మూలంగా ఆకతాయిలు, పోకిరీలకు అడ్డాగా మారి అసాంఘీక కార్యకలపాలకు జరుగుతున్నాయి. మద్యం మత్తులో దుండగులు తలుపులు, కిటికీలను పగలకొడుతుండగా, మరోవైపువర్షాల సీజన్‌లో పశులను తోలుతున్నారు. మండలంలో పోలీస్ స్టేషన్, జూనియర్ కళాశాల లేదని మండల ప్రజలు, విద్యార్థులు కోరుతున్నా పాలకులు హామీలకు పరిమితం అవుతున్నారని ఆరోపిస్తున్నారు. రెండు శాఖలు ఏర్పాటుచేస్తే ఈ భవనాలు ఉపయోగంలోకి వచ్చే అవకాశం ఉందని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చొరవ చూపాలని లేకుంటే ప్రభుత్వ ధనం దుర్వినియోగం అవుతుందని పేర్కొంటున్నారు.

వినయోగంలోకి తీసుకురావాలి..

- బాసంపల్లి రాజేష్



మండల కేంద్రంలోని ప్రభుత్వ భవనాలను పోలీస్ స్టేషన్, విద్యాసంస్థలకు వినియోగించుకోవాలి. లేకుంటే భవనాలు శిథిలమై అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారే అవకాశం ఉంది.

ప్రజాధనం వృథా కావద్దు..

- న్యాతరి పోచయ్య



ఎలిగేడులో రాష్ట్ర ప్రభుత్వం లక్షలు వెచ్చించి నిర్మించిన భవనాలు వృథా కావద్దు. విద్యార్థులకు, ప్రజలకు ఉపయోగపడేలా వాటిని వినియోగంలోకి తీసుకరావాలి.

ధాన్యం కొనుగోలు కేంద్రానికి నాసిరకం గన్నీ సంచులు


రైతులు పడేసిన చినిగిన సంచులు

ఓదెల, నవంబర్ 22 (ఆంధ్రజ్యోతి) : అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కొందరు మిల్లర్లు ఇష్టారాజ్యాంగా వ్యవహరిస్తున్నారు. మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలకు నాసిరకం గన్నీ సంచులను పంపిస్తున్నారు. ఓదెల ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రానికి మూడు రోజుల క్రితం సుల్తానాబాద్ ఓ మిల్లు నుంచి ఐదు వేల మేరకు నాసిరకం గన్నీ సంచులను పంపించారు. దీంతో రైతులకు సక్రమంగా ఉపయోగం లేకుండాపోయింది. దీనికి కొందరు రైస్‌మిల్లర్లు తరుగు పేరుతో ధాన్యంలో కోత విధించేందుకు ప్రయత్నిస్తున్నట్లు కొందరు మహిళలు తెలిపారు. చినిగిన సంచుల్లో ధాన్యాన్ని నింపి తూకం వేస్తున్నప్పటికీ వాహనాల్లో లోడ్ చేసేసరికి తూకం వేసిన ధాన్యం కిందనే పోతుంది. హమాలీ కార్మికులు అతికష్టం మీద తూకం వేసి లారీలో పంపిస్తున్నప్పటికీ చినిగిన గండి సంచుల నుంచి పోతున్నాయి. దీంతో సంచులల్లో ధాన్యం పోసి కుట్లు వేసినప్పటికీ ప్రయోజనం లేకుండా పోతోంది. చివరికి వేబిల్ కాంటాపై ధాన్యం లారీని తూకం వేయగానే అక్కడ తరుగు వస్తున్నట్లు కొందరు కేంద్ర నిర్వాహకులు తెలిపారు. ఇక దీనినే సాకుగా తీసుకుంటున్నట్లు తెలిసింది. హమాలి కార్మికులు విధి లేక చినిగిపోయిన గన్నీ సంచులకు చెత్తను పెడుతూ తాత్కాలికంగా ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతం కేంద్రానికి ఐదువేల మేరకు నాసిరకం గన్నీ సంచులను పంపించడంతో ఇందులో కేవలం రెండు వేల సంచుల మేరకు మాత్రమేఉపయోగపడుతున్నాయి. వెంటనే అధికారులు పర్యవేక్షించి నాసిరకం గన్నీ సంచులను పంపించిన మిల్లర్ యజమానిపై చర్య తీసుకోవాలని, అలాగే మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన గన్నీ సంచులను పంపించాలని రైతులు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

పాలకుర్తి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జీడినగర్ ప్రాంతంలోని యూనివర్సల్ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి సాఫ్‌బాల్ సబ్‌జూనియర్స్ పోటీలకు ఎంపికైనట్లు శుక్రవారం వ్యాయామ ఉపాధ్యాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత నెల 17న గోదావరిఖని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన జిల్లా స్థాయి సాఫ్ట్ బాల్ సబ్ జూనియర్స్ పోటీలలో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఈ నెల 23 నుంచి 25వ తేది వరకు మెదక్ జిల్లా మాసాయిపేట జిల్లా పరిషత్ పాఠశాల మైదానంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జి శుశాంత్, జి అర్జవ్, ఎస్ శాశ్వంత్‌లు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మహమ్మద్ ఇస్మాయిల్, ప్రధానోపాధ్యాయులు సయ్యద్‌అప్జల్ విద్యార్థులను అభినందించారు.


పోటీలకు ఎంపికైన యూనివర్సల్ పాఠశాల విద్యార్థులు



పోటీలకు ఎంపికైన ఇండియన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు

● సుల్తానాబాద్ (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలోని ఇండియన్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు సంప్రతీత్, నిఖిల్, వశీకర్ రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ మాటేటి సంజీవ్ కుమార్ తెలిపారు.

గ్రహణం వీడేదెన్నడో..?

(5వ పేజీ తరువాయి)

మంజూరయ్యాయి. దీంతో 2016 ఆగస్టు 4న మానేరుపై హైలెవల్ వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

● గడువు పొడిగింపులే..

హైదరాబాదుకు చెందిన కన్‌స్ట్రక్షన్ కంపెనీ వంతెన టెండరు దక్కించుకుంది. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తిచేయలేదు. దీంతో 2020లో ఆ కాంట్రాక్టర్‌ను తొలగించినా తర్వాత ఆ కాంట్రక్టర్ మళ్లీ టెండర్ దక్కించుకున్నాడు. 2023 మార్చిలో వంతెన నిర్మించాలని ఒప్పందం జరిగింది. గడువు తీరినా పనులు పూర్తి కాలేదు.

మానేరు తీరం.. అభివృద్ధికి అవకాశం..

మానేరుపై వంతెన నిర్మిస్తే తీరప్రాంతాల్లోని గర్మిళ్లపల్లి, రాఘవాపూర్, గిద్దెముత్తారం, వెంకట్రామపల్లి, మొగుళ్లపల్లి, చిట్యాల, పరకాల, ముత్తారం, ఓడేడు, అడవి శ్రీరాంపూర్, ఖమ్మంపల్లి శరవేగంగా అభివృద్ధి చెందుతాయి. మంథని, గోదావరిఖని తదితర ప్రాంతాలతో పాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలకు రవాణా సౌకర్యం మెరుగుపడే అవకాశం ఉంది.

పట్టారద్దు చేసిన రెవెన్యూ అధికారులు

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పందిళ్ల గ్రామంలో 805/3సర్వే నంబర్‌లో గ్రామానికి చెందిన కుమార్ ఆధీనంలో ఉన్న నాలుగు ఎకరాల 20గుంటల భూమి పట్టా రద్దు చేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. 805/3సర్వే నంబర్‌లో గతంలో కాల్వశ్రీరాంపూర్‌లో పనిచేసిన ఓ తహసీల్దార్ కుమార్ అనే అతనికి ప్రభుత్వ భూమిని ఎలాంటి అసైన్మెంట్ కమిటీ లేకుండా నాలుగు ఎకరాల 20గుంటల భూమిని అక్రమంగా పట్టా చేశాడని గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ దాసరి రమేష్ గత ఫిబ్రవరిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో సంబంధిత రెవెన్యూ అధికారులు సర్వేచేసి పట్టా రద్దు చేసి రికార్డులనుంచి తొలగించడం జరిగిందని తహసీల్దార్ ఎండి.వకీల్ తెలిపారు. త్వరలో ప్రభుత్వ భూమిలో బోర్డు కూడా ఏర్పాటు చేస్తామని తహసీల్దార్ తెలిపారు.

పంచాయతీ కార్యదర్శిని చంపడం బాధాకరం

- టీపీఎస్‌ఎఫ్ గౌరవ అధ్యక్షుడు సందీప్

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా వాజేడు మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శి రమేష్‌ను మావోయిస్టులు నరికి చంపడం బాధాకరమని తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు సందీప్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ రమేష్ కుటుంబానికి నష్టపరిహారం ఇచ్చి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ పథకాలను అమలుచేస్తూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్యవారధిగా పంచాయతీ కార్యదర్శులు పనిచేస్తున్నారన్నారు. ఈ సందర్భంలో రాష్ట్రంలోని పంచాయతీ కార్యదర్శులకు రక్షణ కరువైందని, తరచూ దాడులు జరుగుతున్నాయని, ఇటువంటి సంఘటనలు పునారవృతం కాకుండా, అటవీ ప్రాంతాల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులకు భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

ఆర్థిక సహాయం అందజేత

కమాన్‌పూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జూలపల్లి గ్రామానికి చెందిన గుర్రాల అర్జున్ అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో గాయపడగా కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. గాయపడిన యువకుడి పరిస్థితి విషమంగా ఉండగా, చికిత్స కోసం రూ.6లక్షలు అవసరం అయ్యాయి. ఈ పరిస్థితుల్లో గోదావరిఖనికి చెందిన అక్షర స్ఫూర్తి ఫౌండేషన్ ముందుకు వచ్చి అతను చదువుకున్న పాఠశాల ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, ఇతర దాతల సహకారంతో సేకరించిన రూ.17వేల నగదును రోగి తల్లిదండ్రులకు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు నాగరాజు, కె. తిరుపతి, గోవర్ధన్‌లు ఉన్నారు.

విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించాలి

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల్లో ఉపాధ్యాయులు ఆత్మవిశ్వాసం పెంపొందించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో పాలకుర్తి, ఎలిగేడు మండలాల ఉపాధ్యాయులతో నిర్వహించిన కాఫీ విత్ టీచర్స్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించే ఉపాధ్యాయులు ప్రశంసనీయులన్నారు. బాగా పని చేసే ఉపాధ్యాయులకు సిబ్బందికి ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈవో మాధవి, జిల్లా అకాడమిక్ అధికారి పీఎం షేక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సకాలంలో ధాన్యం డబ్బులు జమ చేయండి


కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

మంథని, రామగిరి నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యం డబ్బులను సకాలంలో రైతులకు అందే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులకు సూచించారు. శుక్రవారం రామగిరి మండలంలోని కల్వచర్ల, మంథని మండలంలోని ఎక్లాస్‌పూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేపట్టారు. సేకరించిన ధాన్యం రిజిస్టర్‌లను పరిశీలించారు. పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొనుగొలుకేంద్రంలో రైతులు ధాన్యం 24గంటల వ్యవధిలో ట్రాక్‌షీట్ జనరేట్ చేయాలని సూచించారు. సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం ప్రత్యేకంగా క్వింటాళ్లకు రూ.500 చొప్పున ప్రకటించిందన్నారు. ఆయన వెంటగా తహసీల్దార్ రాంచందర్‌రావు, ఏడీఎం అంజలి, అధికారులు పాల్గొన్నారు.

మెరుగైన బోనస్ ఇచ్చేవరకు సమ్మె కొనసాగిస్తాం..

- కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు హరి

పాలకుర్తి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : బసంత్‌నగర్ కేశోరాం సిమెంటు కంపెనీలో కాంట్రాక్టు వర్కర్లకు దీపావళి బోనస్ రూ 52 వేలు ఇచ్చేవరకు సమ్మె కొనసాగుతుందని వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కౌశిక హరి అన్నారు. శుక్రవారం కంపెనీ ప్రధాన ద్వారం ఎదుట జరిగిన నిరసనలో పాల్గొన్న హరి మాట్లాడారు. సమ్మెలో పర్మినెంటు వర్కర్స్ యూనియన్, కార్మికులు సైతం పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి మాదాసు శ్రీనివాస్, బత్తిని సతీష్ గౌడ్, సంపత్, దాడి బాపు, బైరి రామకృష్ణ, మల్క నూరి శ్రీధర్, కుర్ర మల్లయ్య, సాదిక్ పాషా, మల్లేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

నేటి నుంచి అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవాలు


కాలనీలోని అయ్యప్ప దేవాలయం

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : యైటింక్లయిన్ కాలనీలోని అయ్యప్పస్వామి దేవాలయ త్రయోవింశతి వార్షికోత్సవాన్ని ఈనెల 23నుంచి మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నది. ఆలయం నిర్మించి 22 వసంతాలు పూర్తయినందున అంగరంగ వైభవంగా వేడుకలను జరపడానికి ఆలయ కమిటీ ఏర్పాట్లను చేస్తున్నది. ఆలయ గురుస్వామి సారంగాచారి ఆధ్వర్యంలో అర్చకులు దేవ ప్రకాష్‌పాండె చేతుల మీదుగా వార్షికోత్సవ వేడుకల పూజాకార్యక్రమాలు నిర్వహించనున్నారు. 23తేదీ శనివారం నుంచి 25వతేదీ సోమవారం వరకు పూజలు జరపనున్నారు. సాయంత్రం పడిపూజ భజనలు జరపనున్నట్లు ఆలయ కమిటీ ఒక ప్రకటనలో పేర్కొన్నది. భక్తులు పాల్గొనాలని కోరింది.



సెంటినరీకాలనీలో సమస్యలు పరిష్కరించాలి


జీఎంకు వినతి పత్రం అందిస్తున్న మాజీ ఎంపీటీసీ

రామగిరి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని సెంటినరీకాలనీలో కార్మిక కుటుంబాలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై పన్నూరు మాజీ ఎంపీటీసీ చిందం మహేష్ శుక్రవారం జీఎం సుధాకర్‌రావుకు వినతి పత్రం అందజేశారు. ఓసీపీ-2 ప్రాజెక్టు కార్యాలయం నుంచి శ్రీలంక క్వార్టర్స్ వెళ్ళే ప్రధాన రహదారి అధ్వానంగా మారిందని, గుంతల్లో కార్మికులు ప్రమాదాల బారి పడుతున్నారని వినతిలో పేర్కొన్నారు. టీటూ, జోన్-1,2, శ్రీలంక క్వార్టర్స్‌లోని అంతర్గత రోడ్లకు మరమ్మతులు చేయించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చేతి సుధాకర్, తాటి సతీష్, మోత్కూరి వెంకటేష్, ఏరవేనా అజయ్, బన్నీ పాల్గొన్నారు.

అంతర్గత ఖాళీల భర్తీకి పరీక్షలు

రామగిరి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి ఆర్జీ-3, ఏపీఏ డివిజన్‌లలో ఖాళీగా ఉన్న అంతర్గత పోస్టుల భర్తీకి శుక్రవారం ఎస్‌అండ్‌పీసీ రీడింగ్ హాల్‌లో రాత పరీక్షలను నిర్వహించారు. డివిజన్‌లో ఖాళీగా ఉన్న సర్వే మజ్దూర్ 2, డంప్‌మెన్, ట్రిప్‌మెన్-4, ఆఫీస్ అటెండెంట్ 4 పోస్టుల భర్తీకి రాత పరీక్షలను నిర్వహించారు. ఈ పరీక్షలకు 18 మంది హాజరు అయ్యారు. పరీక్షలను ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు పర్యవేక్షించారు. ఆయన వెంట అధికారులు రఘుపతి, రాజశేఖర్, చంద్రశేఖర్, సుదర్శనం, జనార్దన్‌రెడ్డి, గుర్రం శ్రీహరి, మతీన్, రాజేశం, తదితరులు పాల్గొన్నారు.

రక్షణ పక్షోత్సవాల నిర్వహణపై సమావేశం


సమావేశంలో చర్చిస్తున్న అధికారులు

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): 55వ రక్షణ పక్షోత్సవాలు 2024 నిర్వహణపై రెస్క్యూ స్టేషన్ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం సేఫ్టీ కమిటీ కన్వీనర్స్ సమావేశం జరిగింది. సింగరేణి సేఫ్టీ జీఎం చింతల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో డీఎంఎస్ నాగేశ్వరరావు, సనత్‌కుమార్ డీడీఎంఎస్, తనిఖీ టీం కన్వీనర్లు పాల్గొన్నారు. సింగరేణి గనులలో ఇతర డిపార్ట్‌మెంట్లలో భద్రత అవగాహన పెంపొందించడం, ప్రమాదాలు తగ్గించడం, భద్రత ఆరోగ్య భద్రత, అలవాట్లు మొదలైన వాటిపై ఉద్యోగులకు అవగాహన కల్పించి చట్టసంబంధమైన మార్పులు వాటిపై అవగాహన, రోజువారి పనుల్లో ఆచరించడం, వాటిని తనిఖీ చేయడం వంటి కార్యక్రమాలను రక్షణ పక్షోత్సవాల్లో జరపనున్నట్టు డీఎంఎస్ నాగేశ్వరరావు తెలిపారు. ఏరియాల వారిగా ఫస్ట్ ఎయిడ్ పోటీలను నిర్వహించాలని అధికారులకు ఆయన సూచించారు. ఈసమావేశంలో ఆర్జీ-2 జీఎం వెంకటయ్య, రిజియన్ సేఫ్టీ అధికారులు రఘుకుమార్, కెహెచ్‌ఎన్ గుప్తా, కృష్ణగోపాల్ తివారి, శ్రీనివాసరెడ్డి, జీఎం ఎన్విరాన్‌మెంట్ బానోతు సైదులు, జీఎం ఐఅండ్‌పీఎం శ్రీనివాసరావు, జీఎం ఆర్‌అండ్‌డీ నాగేశ్వర్‌రావు, జీఎం క్వాలిటీ రవికుమార్, ఇతర డీజీఎంలు, సేఫ్టీ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఈపీ ఆపరేటర్లకు ప్రమోషన్లు ఇవ్వాలి


మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఆర్జీ-3 ఏరియాలో పనిచేస్తున్న ఈపీ ఆపరేటర్లకు పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఓసీపీ-1 ప్రాజెక్టులో శుక్రవారం ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ఆపరేటర్లు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. యూనియన్ సెంట్రల్ సెక్రెటరీ గడ్డం తిరుపతి ఈసందర్భంగా మాట్లాడారు. ఈపీ ఆపరేటర్ల ప్రమోన్ల విషయంలో యాజమాన్యం జాప్యం చేస్తున్నదని, దీంతో ఆపరేటర్లు నష్టపోతున్నట్టు తిరుపతి పేర్కొన్నారు. వేకెన్సీ పేరిట ప్రమోషన్లు నిలిపివేస్తున్నారని, ప్రస్తుతం కంపెనీలో నడుస్తున్న వాహనాలన్నీ బీ, ఏ గ్రేడ్ వాహనాలని అన్నారు. యాజమాన్యం ఇదే తీరుగా వ్యవహరిస్తే తమ గ్రేడ్ కన్నా ఎక్కువ గ్రేడ్ వాహనాలను నడపకుండా ఉంటే ఉత్పత్తిపై ప్రభావం చూపుతుందని తిరుపతి అన్నారు. డీ గ్రేడ్ ఆపరేటర్లకు పరీక్షలు నిర్వహించి సీ గ్రేడ్ ఇవ్వాలని, బీ గ్రేడ్ ఆపరేటర్లకు ఏ గ్రేడ్ ప్రమోషన్లు ఇచ్చేలా యాజమాన్యం దృష్టి సారించాలని తిరుపతి డిమాండ్ చేశారు. ఈనిరసన లో తోకల ప్రవీణ్‌రెడ్డి, మజార్, జహీర్, రాజన్న, వినయ్, దిలీప్‌తో పాటు ఆపరేటర్లు పాల్గొన్నారు.

ఆపరేటర్లకు ప్రమోషన్లు ఇప్పించడంలో విఫలం

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు రెండూ ఈపీ ఆపరేటర్లకు ప్రమోషన్లు ఇప్పించడంలో విఫలమైనట్టు సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ సెక్రెటరీ నరసింహారావు ప్రకటనలో పేర్కొన్నారు. ఉచిత మస్టర్లతో కాలం వెళ్ళదీస్తూ ఆపరేటర్ల ప్రమోషన్ల విషయమై యాజమాన్యంతో చర్చించడంలో నిర్లక్షం చూపుతున్నట్టు విమర్శించారు. బొగ్గు ఉత్పత్తిలో ప్రధాన పాత్ర ఆపరేటర్లదని, సమయానికి గ్రేడ్ ఇవ్వకపోవడంతో ఆపరేటర్లు ఆర్థికంగా నష్టపోతున్నట్టు తెలిపారు. ఆపరేటర్‌గా ట్రైనింగ్‌లో ఉన్నప్పటి నుండి బేసిక్ మిషనరీ ఏ గ్రేడ్ నడుపుతున్న ఈపీ ఆపరేటర్లను చిన్నచూపు చూస్తూ వారి మనోభావాలు దెబ్బతీసేలా యాజమాన్యం వ్యవహరిస్తున్నట్టు తెలిపారు. ఒకప్పుడు ఆపరేటర్లు అంటే గౌరవప్రదమైన ఉద్యోగంగా భావించే వారని, ఇపుడు గ్రేడ్‌ల కోసం అధికారులు, కార్మిక సంఘాల చుట్టూ తిరగాల్సిన దుస్థితిని కల్పించారన్నారు. ఈపీ ఆపరేటర్లకు జరుగుతన్న అన్యాయంపై ఇప్పటికైనా గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు స్పందించి యాజమాన్యంతో చర్చించాలని డిమాండ్ చేశారు. న్యాయపరంగా ఆపరేటర్లకు రావాల్సిన ప్రమోషన్లు బ్యాక్ డేట్‌తో ఇప్పించి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని నరసింహారావు డిమాండ్ చేశారు.

వకీల్‌పల్లె గని ఉత్పత్తిపై జీఎం సమీక్ష

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): వకీల్‌పల్లె భూగర్భ గని ఉత్పత్తిపై ఆర్జీ-2 జీఎం బీ వెంకటయ్య శుక్రవారం సమీక్షించార. పీఓ కార్యాలయంలో పని స్థలాలను సర్వే మ్యాప్ ద్వారా పరిశీలించారు. 3వ సిమ్ టాప్ సెక్షన్, 4వ సిమ్‌లో నడుస్తున్న ఎల్‌హెచ్‌డీ, కంటిన్యూయస్‌మైనర్‌ల ద్వారా బొగ్గు ఉత్పత్తిపై గని అధికారులతో చర్చించారు. ఆర్థికసంవత్సరం దగ్గర పడుతున్న క్రమంలో గనికి కేటాయించిన వార్షిక ఉత్పత్తి లక్ష్యాలను రక్షణ సూత్రాలు పాటిస్తూ సాధించేలా కృషి చేయాలని అధికారులకు జీఎం సూచించారు. ఉత్పత్తి పెరుగుదలకు తీసుకోవాల్సిన విషయాలపై అధికారులకు జీఎం పలు సూచనలు చేశారు. జీఎం వెంట ప్రాజెక్టు అధికారి నెహ్రూ, మేనేజర్ రవికిరణ్, గ్రూప్ ఇంజనీర్ చంద్రశేఖర్, అడిషనల్ మేనేజర్ తిరుపతి, సేఫ్టీ ఆఫీసర్ రాంకుమార్, సర్వే ఆఫీసర్ అఫ్సర్ పాషా, డీవైపీఎం శ్యాంసుందర్ ఉన్నారు.

జిల్లా మత్స్య శాఖ అధికారిని కలిసిన నాయకులు

జూలపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని వడుకాపూర్‌కు చెందిన ముదిరాజ్ కులసంఘం నాయకులు శుక్రవారం జిల్లా మత్సశాఖ అధికారిగా బాధ్యతలను చేపట్టిన నరేష్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసారు. అనంతరం ఆయనకు పుష్పగుచ్ఛం అందించిన సన్మానించారు. మత్స్యకారుల అభివృద్ధికి కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు కనకట్ల స్వామి, ఉపాధ్యక్షుడు జెట్టి సతీష్, తీగెల రమేష్, జెట్టి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.